# పరీక్షా సమయం

## చదువుటకు నియమించినవి #16

V. రెండవ పస్కానుండి మూడవ దాని వరకు (కొనసాగింది).
  X. హేరోదు ప్రాంతమునుండి యేసు తొలిగిపోవుట (తిరిగి వచ్చుట) (కొనసాగింది).
    2. 5000 మంది పురుషులకు ఆహారము పెట్టుట (మత్తయి 14:13–21; మార్కు 6:33–44; లూకా 9:11–17; యోహాను 6:2–14).
    3. నీటి మీద నడచుట (మత్తయి 14:22–36; మార్కు 6:45–56; యోహాను 6:15–21ఎ).
  Y. జీవాహారాన్ని గూర్చి ప్రభువు చర్చించుట (పేతురు ఒప్పుకోలు) (యోహాను 6:21బి–71).

### పరిచయం

5000 మందికి ఆహారం పెట్టుట అనే యేసు యొక్క ప్రసిద్ధిగాంచిన అద్భుతంతో ఈ పాఠం ఆరంభమౌతుంది. జీవాహారము అనే బహు కీలకమైన ప్రసంగంతో లేక చర్చతో యిది ముగించబడుతుంది. మొదటిది, తన భూసంబంధమైన పరిచర్యలో ఉన్నతమైనది; రెండవది బహు తక్కువైన గడియలను సూచిస్తుంది.

ఈ పాఠంలో, రెండు పదాలమీద మనం దృష్టిని నిలుపబోతున్నాం. మొదటి పదం "పరీక్ష." జనసమూహానికి యేసు ఆహారంపెట్టక ముందు, ఫిలిప్పును యిలా అడిగాడు: "– వీరు భుజించుటకు ఎక్కడనుండి రొట్టెలు కొని తెప్పింతుము?" (యోహాను 6:5బి). "అతనిని పరీక్షించుటకు" ప్రభువు యిలా అడిగినట్టు యోహాను దాఖలు చేశాడు (యోహాను 6:6). తరువాత ఆయన తన శిష్యులతో సంభాషించిన తీరు తక్కిన అపొస్తలులను కూడా పరీక్షించినట్టు తేలుతుంది.

రెండవ పదం– "విశ్వాసము" లేక "నమ్మిక." జీవాహారపు ప్రసంగములో, ఆయా రూపాల్లో విశ్వాసమనే మాట మాటిమాటికి కన్పిస్తుంది (యోహాను 6:29, 35, 36, 40, 47). విశ్వాసము యొక్క అవసరతను ఆయన నొక్కి చెప్పుతున్నట్టు మనం ముందుగానే చూచాం.[1]

తన్ను వెంబడించే వారిని క్రీస్తు పరీక్షించే కాలం వచ్చింది – ఆయనను వారు నిజంగా నమ్ముతారో లేదో నిరూపింపబడుతుంది. "పరీక్ష," "విశ్వాసము" ఈ ప్రతిసందర్భంలో కన్పించవు. కాని ప్రతి సంఘటనలో యిమిడి – తన్ను వెంబడిస్తున్నామని చెప్పుకొనే వారి విశ్వాస పరీక్షగా నిలిచియున్నాయి.

## పచ్చిక మైదానం మీద ఒక పరీక్ష
## (మత్తయి 14:13-21; మార్కు 6:33-44; లూకా 9:11-17; యోహాను 6:2-14)

మన గత పాఠపు ముగింపులో, గలిలయ సముద్రపు తూర్పు తీరానికి పడవలో తానును తన అపొస్తలులును పయనించాలని యేసు ప్రతిపాదించారు. (మార్కు 6:30-32; మత్తయి 14:13; యోహాను 6:1 చూడు).[2] బేత్సయిదా - జూలియస్ అనే గ్రామానికి సమీపంలోని ఎడారికి వారు వెళ్లబోతున్నారు (లూకా 9:10).

వారు తీరానికి సమీపించుచుండగా, జనసమూహాలు కూడివచ్చాయి - వందలాది ప్రజలు - ప్రతి నిమిషానికి ఎక్కువమంది పోగౌతున్నారు.[3] ప్రభువు కృపగలవాడై "వారియందు కనికరపడ్డారు." తన సహజమైన విధానంలో, ఆయన వారికి బోధించారు, వారి మధ్య రోగులను స్వస్థపరచారు (మత్తయి 14:14; మార్కు 6:34; లూకా 9:11).

### విశ్వాసం పరీక్షింపబడింది: "మీ అవసరతలు తీర్చడానికి నన్ను నమ్మగలరా?"[4]

ఆ దినం గడిచేకొద్ది, జనం ఎక్కువై వేల సంఖ్యలోనికి చేరుకున్నారు (లూకా 9:14). పరీక్ష ఆరంభమయ్యింది:

> కాబట్టి యేసు కన్నులెత్తి బహు జనులు తన యొద్దకు వచ్చుట చూచి - వీరు భుజించుటకు ఎక్కడనుండి రొట్టెలు కొని తెప్పింతుమని ఫిలిప్పునడిగెను గాని యేమి చేయనైయుండెనో తానే యెరిగియుండి అతనిని పరీక్షించుటకు అలాగడిగెను (యోహాను 6:5, 6).

లెక్కించే తన సామార్థ్యాన్ని క్రీస్తు పరీక్షిస్తున్నట్టు ఫిలిప్పుకనుగొన్నాడు."అందుకు ఫిలిప్పు-వారిలో ప్రతివాడును కొంచెము కొంచెము పుచ్చుకొనుటకైనను రెండువందల దేనారముల రొట్టెలు చాలవని ఆయనతో చెప్పెను" (యోహాను 6:7).

వెను వెంటనే, విశ్వాసము యొక్క అదే ప్రాథమిక పరీక్ష మిగిలిన అపొస్తలులకును యివ్వబడింది:

> సాయంకాలమైనప్పుడు శిష్యులాయన యొద్దకు వచ్చి - ఇది అరణ్య ప్రదేశము, ఇప్పటికే ప్రొద్దుపోయెను, ఈ జనులు గ్రామములోనికి వెళ్లి భోజన పదార్థములు కొనుక్కొనుటకై వారిని పంపివేయుమని చెప్పిరి. యేసు - వారు వెళ్లనక్కరలేదు, మీరే వారికి భోజనము పెట్టుడని వారితో చెప్పెను (మత్తయి 14:15, 16).

జనసమూహానికి "తినడానికి ఏదైనా" పెట్టుమని ప్రభువు వారికి తెలపడంలో, లభ్యమయ్యేవాటిని సమకూర్చేవారి సామార్థ్యానికి పరీక్షగా వారు భావించినట్టున్నారు. వారికిగా ఏ ఆహారపదార్థాలు లేవు.[6] వారు జనాలలోనికి వెళ్లి సమకూర్చగలిగిన దంతా ఒక పనివాని ఆహారం మాత్రమే (మత్తయి 14:17).

ప్రభువు అనేక అద్భుతాలు చేసినది అపొస్తలులు చూచారు. వాటిలో తుఫానును

అణచడం, చనిపోయిన వారిని లేపడం వంటివి కూడా ఉన్నాయని జ్ఞాపకముంచుకోవాలి. పైగా, యిటువంటి అద్భుతాలు చేయగల శక్తిని ప్రభువు వారికి కూడా ప్రసాదించారు (మత్తయి 10:1). అయినా, ఒక అద్భుతం చేసిన ప్రభువు ఏ అద్భుతాన్నైనా[7] చేయగలడని – అంటే, అయిదు రొట్టెలు రెండు చేపలతో – అయిదు వేలమంది పురుషులకే గాక, స్త్రీలకు పిల్లలకు సహితం ఆహారం పెట్టగలడని వారు గ్రహించలేక పోయారు.

అత్యల్పమైన భోజన పదార్థాలను చేతులలోనికి తీసికొని, పచ్చిక మీద కూర్చుండుడని ఆయన సమూహానికి తెలిపారు (మత్తయి 14:19). భోజనానికి అయిదు రొట్టెలు రెండు చేపలు మాత్రమే కన్పిస్తున్నాయి.[8] ఈ విధంగా పరీక్ష ప్రతివారికి విస్తరింపజేయబడింది. క్రీస్తు ఆజ్ఞాపించినట్టు చేయడానికి శిష్యులకేమి జనసమూహాలకు కూడా ఆయనయందు విశ్వాసం కుదిరింది.

## పరీక్ష ఫలితాలు: భోజనము – అపార్థం

మనం ఒక పరీక్ష వ్రాసినప్పుడు, దాని ఫలితాలు తెలిసికోవాలని ఆతురత పడతాం. ఈ సందర్భంలో, అక్కడున్న వారి విశ్వాసము బహుమానం పొందింది: ఒక బాలుని భోజనం[9] వేలమందికి సమృద్ధిగా సరిపోయింది:

> వారందరు తిని తృప్తిపొందిన తరువాత మిగిలిన ముక్కలు పండ్రెండు గంపలనిండ ఎత్తిరి. స్త్రీలును పిల్లలును గాక తినినవారు ఇంచుమించు అయిదు వేలమంది పురుషులు (మత్తయి 14:20, 21; మార్కు 6:41–44; లూకా 9:16; యోహాను 6:12లను చూడు).

తిన్నవారు ఆనందించారు[10]– అయితే ఆ భోజనము మరొక పరీక్షకు దారితీసినట్టు వారు గుర్తించలేక పోయారు: ప్రభువును, ఆయన పనిని గూర్చి వారు ఎలా గుర్తించారు అనే పరీక్ష. జరిగినదాన్ని బట్టి ఉల్లాసభరితులై "– నిజముగా ఈ లోకమునకు రాబోవు ప్రవక్త[11] ఈయనే అని చెప్పుకొనిరి" (యోహాను 6:14). ఈయన కొరకే వారు ఎదురుచూస్తుంది![12] త్వరలోనే "రాజుగా చేయుటకు వారు వచ్చి తన్ను బలవంతముగా పట్టుకొన బోవుచున్నారు" (యోహాను 6:15).

"ఆయనను రాజుగా చేయడమా"? ఆయన రాజుగానే జన్మించారు (మత్తయి 2:2).[13] భూసంబంధమైన రాజు అనే యూదుల మధ్య ప్రచురమైన భావనే వారికుంది: తన శత్రువులకు విరోధంగా తమ్మును జయోత్సవంతో నడిపించే రాజు. వారి ఊహలను ప్రభువు చేసిన ఈ అద్భుతము మండించింది. ఆయన సైన్యానికి సైన్యాధిపతిగా గడిపించడం మాత్రమేగాకుండ, సైన్యానికి దాని అనుదిన భోజనాన్ని సరఫరాచేయగల యజమానిగా కూడా ఆయన పని చేస్తారని వారు నిరీక్షించినట్టున్నారు. భౌతిక రాజుగా ఆయన్ను అంగీకరించడం ఆత్మసంబంధమైన తమ రాజుగా వారు నిరాకరించినట్టేయన్న భావనను వారు అర్థం చేసికోలేకపోయారు.

వారి ఉద్దేశాలనెరిగి, తన శిష్యులను పంపివేయడంతోను,[14] జనసమూహాలను పంపివేయడంతోను వారి ఆశలను అడియాశలుగా ఆయన చేశారు.[15] అప్పుడు విచారం

కలిగించేలా,[16] ఆయన సమీపమునున్న ఒక పర్వతాన్ని అధిరోహించారు.[17] ఒంటరిగా ఉండి ప్రార్థించడానికి ఆయన ఈ పని జరిగించారు (మత్తయి 14:22, 23; మార్కు 6:45, 46; యోహాను 6:15-17ఎ).

## తుఫాను సముద్రము మీద పరీక్ష

## (మత్తయి 14:22-33; మార్కు 6:45-52; యోహాను 6:15-21ఎ)

నావలో ప్రవేశించి కపెర్నహూమునకు వెళ్తునట్టు ప్రభువు తన (శిష్యులకు) అపొస్తలులకు తెలిపినప్పుడు, ఆయన జనసమూహమును పంపివేసాక తమను వచ్చి కలుసుకుంటారని వారు నిరీక్షించారు (యోహాను 6:17 చూడు). వారు సముద్రతీరాన కొంత సేపు జాగుచేసియుండవచ్చు, వారు కొంత దూరం నావను నడిపించియుండి యుండవచ్చు. ప్రభువు రాకపోయేసరికి, సముద్రాన్ని దాటనారంభించారు.

**విశ్వాసానికి పరీక్ష ఎదురయ్యింది: "మిమ్ము కాపాడగలనని నమ్ముతారా?"**

సముద్రంలో సగం దూరం పోయినంతలో[18] తటాలున ఏర్పడిన తుఫానుచే వారికి తీవ్రమైన తాకిడి కలిగింది. ఆ నీళ్లకు అది క్రొత్త కాదు.[19] "అప్పుడు పెద్దగాలి విసరగా సముద్రము పొంగుచుండెను" అని యోహాను అన్నాడు (యోహాను 6:18). వారు "అలలచేత కొట్టబడినట్టు" మత్తయి అన్నాడు (మత్తయి 14:24). వారు వెళ్లవలసిన దిశనుండే గాలిబలంగా వీస్తుంది (మత్తయి 14:24; మార్కు 6:48). గనుక వారు శక్తికొలది తెడ్లు వేస్తున్నారు (మార్కు 6:48). గంటల తరబడి వారు తెడ్లు వేస్తున్నారు,[20] అయినా ఎగసిపడే ఆ నీళ్లలో ఎక్కువగా ముందుకు సాగలేకున్నారు.

వారు అలసిపోయి నిరుత్సాహపడడం మాత్రమే మనం ఊహించగలం. మరోసారి, వారి విశ్వాసము పరీక్షింపబడింది.[21] గతంలో తుఫానును నిమ్మళింపజేసి ప్రభువు వారిని కాపాడారు.[22] అయితే ఈ సందర్భంలో ఆయన వారితో లేరే. ఈసారి ఆయన చాలా దూరంగా ఉన్నారు.

వారినుండి ఆయన ఎన్నో మైళ్ల దూరంగా ఉన్నా, ఆయనకు వారి యిబ్బంది తెలుసు. మార్కు యిలా వ్రాశాడు:

> సాయంకాలమైనప్పుడు ఆ దోనె సముద్రము మధ్య ఉండెను. ఆయన ఒంటరిగా మెట్టనుండెను. అప్పుడు వారికి గాలి ఎదురైనందున, దోనె నడిపించుటలో వారు మిక్కిలి కష్టపడుచుండగా ఆయన చూచి, రాత్రి యించుమించు నాలుగవ జామున సముద్రముమీద నడుచుచు వారి యొద్దకు వచ్చి, వారిని దాటిపోవలెననియుండెను (మార్కు 6:47, 48).

ఆయన నీళ్ల మీద నడచుట అందరికి తెలిసిన అద్భుతం. నీవు దీనిని నీ మనస్సులో చిత్రించుకొనినప్పుడు, నెమ్మదిగానున్న నిశ్చలమైన నీటి ఉపరితలంమీద నడుస్తున్నట్టు వీక్షించకూడదు - అయితే సాధారణంగా యిది అలా భావించబడుతుంది. సముద్రము

తుఫాను అలలచే కొట్టబడుతున్న స్థితిలో లేస్తూ పడుతూ ఉండే అలలపై ఆయన నడుస్తున్నారు సుమీ!

క్రీస్తు ఆ నావ సమీపానికిరాగా, ఆయన రూపాన్ని ఒక్కసారి చూడగలిగారు. ఎదురు చూడని ఆయన ప్రత్యక్షత తుఫానుకంటె ఎక్కువ భీతిని కలిగించింది.[23] అయితే వారు భయపడి, "భూతమని" చెప్పుకున్నారు![24] భయముతో కేకలు వేశారు (మత్తయి 14:26; మార్కు 6:49, 50ఎ). "వెంటనే యేసు – ధైర్యము తెచ్చుకొనుడి; నేనే, భయపడకు డని" వారి భయమును నిమ్మళింపజేశారు (మత్తయి 14:27; మార్కు 6:50బి; యోహాను 6:20లను చూడు).

తరువాత మత్తయి 14లో పేతురు నీళ్లమీద నడిచే కథ ఉంది, "పేతురు – ప్రభువా, నీవే అయితే నీళ్లమీద నడిచి నీ యొద్దకు వచ్చుటకు నాకు సెలవిమ్మని ఆయనతో అనెను" (28 వ.). "ఆయన రమ్మనగానే పేతురు దోనె దిగి యేసునొద్దకు వెళ్లుటకు నీళ్లమీద నడచెను" (29 వ.). అతని దృష్టి ప్రభువు మీద నిలిపినంతకాలం అతడు నీళ్లపై నిలిచియుండెను గాని – అతని దృష్టి తుఫానుతో నిండిన సముద్రాన్ని చూచినప్పుడు అతడు భయపడి మునిగిపోసాగెను అనే కామెంట్ నేను తరచుగా విన్నాను (30ఎ వ.). "ప్రభువా, నన్ను రక్షించుమని కేకలువేసెను" (30బి వ.). "వెంటనే యేసు చెయ్యి చాపి అతని పట్టుకొని – అల్పవిశ్వాసీ, ఎందుకు సందేహపడితివని అతనితో చెప్పెను" (31 వ.). మనలో కొందరివలె, ప్రారంభించడానికి పేతురుకు చాలినంత విశ్వాసముంది గాని ముగించడానికి చాలినంత విశ్వాసం లేదు.

### పరీక్ష ఫలితాలు: నెమ్మది – మరియు తికమక

శిష్యులు ప్రభువును, పేతురును నావలోనికి చేర్చుకున్నారు (యోహాను 6:21ఎ; మత్తయి 14:32ఎ). వెంటనే,[25] ఆయన దోనెయెక్కి వారియొద్దకు వచ్చినప్పుడు గాలి అణగెను; "అందుకు వారు తమలో తాము మిక్కిలి విభ్రాంతినొందిరి" (మార్కు 6:51). "అంతట దోనెలో నున్నవారు వచ్చి – నీవు నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మొక్కిరి" (మత్తయి 14:33).

ఇది సుఖాంతమైన కథగా గోచరిస్తుంది. కాని మార్కు చెప్పిన ప్రకారం నిజానికి అపొస్తలులు కీలకమైన పరీక్షలో తప్పిపోయారు. "వారు తమలోతాము మిక్కిలి విభ్రాంతి నొందిరి; ... వారు రొట్టెలను గూర్చిన సంగతి గ్రహింపలేదు" అని మార్కు నమోదు చేసాడు (మార్కు 6:51బి, 52ఎ). ఆయన వారిని గురించి శ్రద్ధను కనబరచడంతోపాటు క్రీస్తు కావించిన ప్రతి సంఘటనలోను దైవత్వం ఇమిడి ఉంది. "రొట్టెల ఉదంతం" నుంచి వారు పొందిన "జ్ఞానం" ఏమై ఉంటుంది? ప్రభువు మైదానంలో వారికి ఆహారాన్నివ్వ గలిగినట్టయితే, సముద్రం మీద కూడా అతడు తమను రక్షించగలడన్న నమ్మకం వారికి కలిగియుండాలి.

మార్కు ప్రకారం వారి సమస్య ఏమిటంటే – "వారి హృదయము కఠినమాయెను" (మార్కు 6:52బి). యేసును గురించి కొంత ప్రశంస, గ్రహింపు కొంత మట్టుకు నమ్మకం ఉన్నాయి, కాని వారి జీవితాన్ని, హృదయాన్ని, సంపూర్ణంగా ఆయనకు సమర్పించడం

వారికి కష్టమయింది. ఈ ప్రత్యేకమైన సమస్య ఆ పన్నెండుగురితోనే ఆంతమైందీ కాదు ఆరంభమైనదీ కాదు.

## జనసమూహముతో నిండిన సమాజమందిరములో పరీక్ష

## (మత్తయి 14:34-36; మార్కు 6:52-56; యోహాను 6:21-71)

ఆ తుఫాను రాత్రిలో మరొక అద్భుతం జరిగింది. ప్రభువు, పేతురులు నావలోనికి ప్రవేశించినతోడనే "ఆ దోనె వారు వెళ్లుచున్న ప్రదేశమునకు చేరెను" (యోహాను 6:21బి). కపెర్నహూమునకు దక్షిణమున నున్న సారవంతమైన గన్నెసరతు మైదానమునకు వారు చేరుకున్నారు[26] (మత్తయి 14:34; మార్కు 6:53). ఉత్తర దిశగా కపెర్నహూమునకు వెళ్లుతూ, మార్గంలో ప్రజలను స్వస్థపరచుచున్నారు (మత్తయి 14:35, 36[27]; మార్కు 6:54-56).

ఇంతలో, సముద్రానికి తూర్పు తీరమున ఉన్నవారు, యేసు అక్కడలేరని కనుగొన్నారు (యోహాను 6:22, 24). పశ్చిమ తీరాన దోనెలు కనబడగా, వారు యేసు ఉండే కపెర్నహూమునకు సముద్రము దాటి వెళ్ల ఏర్పాట్లు చేసుకున్నారు (యోహాను 6:23, 24).[28]

### విశ్వాసానికి పరీక్ష జరిగింది: "మీకు జీవము ప్రసాదింప మీరు నన్ను నమ్ముతున్నారా?"

క్రీస్తును వెదకుతున్నవారు, ఆయన సమాజమందిరములో బోధించుచుండగా కనుగొన్నారు (యోహాను 6:59). తమకు తెలియకుండ వారిని ఎలా వదలిపోయారో వారు ఆశ్చర్యపోతూ (యోహాను 6:22), "బోధకుడా, నీవెప్పుడు ఇక్కడికి వచ్చితివని" ఆయననడిగారు (యోహాను 6:25బి). ఆ దినాన వారు ప్రభువును అడిగిన ప్రశ్నలలో యిది మొదటిది. ఆయనను పరీక్షించడానికి వారు ఈ ప్రశ్ననడిగినట్టు భావించారు. వాస్తవానికి, అలా ప్రశ్నించినవారే నిజంగా పరీక్షింపబడ్డారు. అది వారి విశ్వాసం లేక విశ్వాసలేమిని బయలుపరచడమే అయ్యింది. జనసమూహంతో ఆరంభమై కేవలం అపొస్తలులు మాత్రమే మిగిలిపోయే వరకు పరీక్షల పరంపర కొనసాగింది. "ఈ మనిషివైపుకు నన్ను ఆకర్షించింది ఏమి? నేను ఆయనను ఎందుకు వెంబడిస్తున్నాను? ఆయన నిజంగా ఎవరని నా భావన?" అని ప్రతివాడు తన్ను తాను పరీక్షించుకునేలా ఆయన వారితో సంభాషించారు.

(1) **జనసమూహమునకు పరీక్ష ఎదురయింది:** కపెర్నహూమునకు ఆయన వచ్చి చేరుకున్నదాని గూర్చి జవాబు చెప్పడానికి బదులు, జీవాహారము అనే అంశంమీద క్రీస్తు మాట్లాడారు. తప్పుడు భావనతో వారు తనను అనుసరిస్తున్నట్టు యేసు వారిపై నేరం మోపాడు:[29]

> మీరు సూచనలు చూచుటవలన కాదు, గాని రొట్టెలు భుజించి తృప్తిపొందుట వలననే నన్ను వెంబడించుచున్నారని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. క్షయమైన

ఆహారము కొరకు కష్టపడకుడి గాని నిత్యజీవము కలుగజేయు అక్షయమైన ఆహారము కొరకు కష్టపడుడి (యోహాను 6:26, 27ఎ).

వారి ఉద్దేశాలను ప్రాధాన్యతలను పరీక్షించుకొనవలసిందిగా క్రీస్తు తన శ్రోతలను కోరుతున్నారు – అయితే వారు విన్నదేమంటే – వారు పనిచేసినట్టయితే అక్షయమైన ఆహారము వారికి లభిస్తుందట. "– మేము దేవుని క్రియలు జరిగించుటకు ఏమి చేయవలెనని" వారాయనను అడిగారు (యోహాను 6:28). తన ప్రసంగాంశాన్ని ప్రవేశపెట్టడానికి యిది ఆయనకు అవకాశం కలిగించింది. "యేసు – ఆయన పంపినవానియందు మీరు విశ్వసించుటయే దేవుని క్రియయని వారితో చెప్పెను" (యోహాను 6:29).

ఆ చర్చ కొనసాగుతున్న దిశ జనులకు అయిష్టంగా మారింది. పరిసయ్యుల ఆలోచనలను గ్రహించి తమ కొక సూచననిమ్మన్నారు (మత్తయి 12:38ని చూడు), "అట్లయితే మేము చూచి నిన్ను విశ్వసించుటకు నీవు ఏ సూచకక్రియ చేయుచున్నావు?" (యోహాను 6:30). ఆ రోజుకు ముందుగానే, ఆయన అద్భుతరీతిగా స్వస్థపరిచారు, ఆశ్చర్యకరంగా వారికి ఆహారం పెట్టారు. అంతమాత్రం వారికి సరిపోలేదు. కఠిన హృదయులకు ఏ సూచకక్రియయు సరిపోదు.

వారికి నిజంగా కావలసిందేమంటే మరొక ఉచిత భోజనం. యేసు మోషేవంటి ప్రవక్తయని వారు గుర్తించినట్టున్నారు.[30] వారి పితరులకు మోషే అరణ్యంలో ఆహారం అనుగ్రహించాడు – కేవలం ఒక్కసారి మాత్రమే కాదు, అనుదినం (యోహాను 6:31; నిర్గమ 16 చూడు)! మోషే కాదు, దేవుడే ఆ ఆహారాన్ని వారి కనుగ్రహించినట్టు తెలిపారు (యోహాను 6:32ఎ). పైగా, యిప్పుడైతే దేవుడు పరలోకమునుండి దిగివచ్చి నిజమైన ఆహారము అనుగ్రహిస్తారని, అది లోకానికి జీవమిస్తుందని ఆయన వారికి తెలియజేశారు (యోహాను 6:32బి, 33బి).

"జీవమిచ్చు ఆహారము" – అది అసలు వారికి కావలసినది! "కావున వారు – ప్రభువా, యీ ఆహారము ఎల్లప్పుడును మాకు అనుగ్రహించుమనిరి" (యోహాను 6:34).[31] మరోసారి, యేసు యొక్క ప్రత్యుత్తరము ఎదురుచూడని – వారు యిష్టపడని దిశకు తిరిగింది. ఆయన పెదవులనుండి ఈ దిగ్భ్రమ కలిగించే ప్రతిపాదన బయలుదేరింది: "జీవాహారమును నేనే" (యోహాను 6:35ఎ). యోహానులో కన్పించే "నేనే" అనే ఏడింటిలో యిది మొదటిది[32] ప్రతిదానికి దానికైన ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అయితే అందులో ప్రతిదీ ఆయన దైవత్వాన్ని స్థాపించే ప్రతిపాదనయైయుంది; ఎందుకంటె కేవలం దేవుడు మాత్రమే ఏ నాడైనా, ఏ తరంలోనైనా "నేనే" అని అనగలడు. అంటే, నేను నిరంతరం సజీవుడను అని అనగలడు (నిర్గమ. 3:13–15 చూడు).

దిగ్భ్రమ కలిగించే ఆ ప్రతిపాదనను యేసు యిలా కొనసాగించారు: "నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు, నా యందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు" (యోహాను 6:35బి). మరల – "విశ్వసించు" అనే పదం విడువక ఉపయోగించ బడుతుంది.[33] అయితే దుఃఖకరమైన ఈ ప్రతిపాదనను ఆయన యిలా

చేర్చుతున్నారు: "మీరు నన్ను చూచియుండియు విశ్వసింపకయున్నారని మీతో చెప్పితిని" (యోహాను 6:36). J. W. McGarvey యిలా వ్రాశాడు:

> యేసు యొక్క వ్యక్తిత్వమే ఆయన దేవత్వానికి గొప్ప రుజువైయుంది, అయితే యూదులు దాన్ని ఆలోచింప నిరాకరించారు; మరియు వారు ఒక సూచక క్రియ కొరకు అడుగుతున్నారు. దాని వెలుగును చూచినప్పుడు దాని వేడిని అనుభవించి, ప్రాణమిచ్చే దాని శక్తిని తిలకించి ఒకడు సూర్యుని నమ్మ నిరాకరించినప్పుడు, సూర్యుని ఉనికి కొరకు మరి ఏ విధమైన సూచనను ప్రదర్శించాలి?[34]

(2) **"యూదులు" పరీక్షింపబడ్డారు.** ఈ పరిస్థితిలో, వారు ఆయనను గురించి సణగ సాగారు. ఎందుకంటే, "పరలోకమునుండి దిగివచ్చిన ఆహారమును నేనే" అని ఆయన చెప్పారు (యోహాను 6:41). "యూదులు" అని ప్రభువు తరచుగా ఉపయోగించిన పదం యూదుల నాయకులను సూచించింది (1:19; 5:10, 15, 16, 18) ఒకవేళ యిక్కడ అర్థం కూడా అదే కావచ్చు.

వారు ఎంత సణుగుకున్నా, ప్రభువు మాత్రం తనను గూర్చి తాను చెప్పుకున్న దానినుండి వెనుకకు తగ్గేది లేదు సరిగదా, ఆయన దాన్ని నొక్కి చెప్పారు:

> జీవహారము నేనే. మీ పితరులు అరణ్యములో మన్నాను తినినను చనిపోయిరి. దీనిని తినువాడు చావకుండునట్లు పరలోకమునుండి దిగివచ్చిన ఆహారమిదే. పరలోకమునుండి దిగి వచ్చిన జీవాహారమును నేనే. ఎవడైనను ఆ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును; మరియు నే నిచ్చు ఆహారము లోకముకొరకైన నా శరీరమే అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను (యోహాను 6:48–51).

ఆత్మసంబంధమైన జీవాన్ని కొనివచ్చుటకు యేసు సశరీరుడుగా ప్రత్యక్షమయ్యెను (యోహాను 1:14). (యోహాను 10:10). పైగా, లోకమునకు జీవముకలుగునట్లు కొద్ది నెలల కాలంలోనే సిలువపై ఆయన దేహాన్ని మేకులతో కొట్టుటకు అప్పగించుకో బోతున్నారు. ఆలాటి గొప్ప ఆలోచనలు తమ మనస్సులను మూసికొన్న యూదులకు అందనివిగా ఉండిపోయాయి. విషయాన్ని వివరించమని ప్రభువును వారు వినయంతో అడగడానికి బదులు "యూదులు – ఈయన తన శరీరమును ఏలాగు తిన నియ్యగలడని యొకనితో ఒకడు వాదించిరి" (యోహాను 6:52). అందుకు ప్రభువు యిచ్చిన బదులు యింకను ఆశ్చర్యంగాను, వింతగాను తోచింది: "– మీరు మనుష్య కుమారుని శరీరము తిని ఆయన రక్తము త్రాగితేనే కాని, మీలో మీరు జీవము గలవారు కారు" అని ఆయన తేల్చి చెప్పారు (యోహాను 6:53).

మత సంబంధమైన భావంతో "భోజనం చేయడం" వారికి ఎరుకైనదే. డేవిడ్ స్మిత్ యిలా అన్నాడు: "ఈలాటి భాష యూదులకంటె ఆధునికుల చెవులకు వింతగా సోకవచ్చు. ఎందుకంటె, లేఖనాలలో వలే రబ్బీయుల సాహిత్యంలోను, సందేశము ఆహారము (రొట్టె) దాన్ని గ్రహించడం భుజించడంగాను వారు పిలుస్తారు"[35] అలాగైనా, శరీరముతిని, రక్తము త్రాగడమనేది వారికి సహించరానిదిగా ఉంటుంది. రక్తం తినడాన్ని గాని త్రాగడాన్ని గాని ధర్మశాస్త్రం నిషేధించింది (లేవీ. 17:10–14).

తన శరీరాన్ని తిని రక్తాన్ని త్రాగమనడంలో క్రీస్తు చెప్పిన అర్థం వారు నరమాంస భక్షకులని కాదు.[36] "శరీరంలో ఉన్న" మెస్సీయగా ఆయనను అంగీకరించవలసిందిగా ఆయన వారిని ఆదేశించారు. నిజంగా, తన "శరీరాన్ని తినడమంటే" ఏమో సందేహ వాదులకు ఆయన వివరించారు కాని వారు దాన్ని ఆలకించలేదు.

> ... ఆయన పంపినవానియందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియ (యోహాను 6:29).
>
> ... నా యందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు (యోహాను 6:35).
> కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము ... (యోహాను 6:40).
>
> విశ్వసించువాడే నిత్యజీవము గలవాడు ...(యోహాను 6:47).

దీన్ని ఆలోచించు: "విశ్వసించువాడే నిత్యజీవముగలవాడు" (యోహాను 6:47; 40వ వచనం కూడా చూడు). దీనికి తరువాత వెంటనే ఆయన యిలా అన్నాడు: "నా శరీరము తిని నా రక్తము త్రాగువాడే నిత్యజీవముగలవాడు" (యోహాను 6:54ఎ). జీవానికి రెండు మార్గాలు లేనట్టయితే, (వాస్తవానికి మార్గమొక్కటే; యోహాను 14:6), ఆయన "శరీరమును తిని ఆయన రక్తమును త్రాగుట" అంటే "ఆయనయందు విశ్వాసముంచుట" అని అర్థం.

ఆయనను గూర్చి తెలుసుకొనడం నుంచి మనకు విశ్వాసం కలుగుతుంది, తరువాత మనం తెలుసుకున్న దానిని అంగీకరిస్తాం. క్రీస్తు యిలా అన్నారు: "– వారందరు దేవుని చేత బోధింపబడుదురు[37] అని ప్రవక్తల లేఖనములలో రాయబడియున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" (యోహాను 6:45). మరియు వారితో యిలా అన్నారు: "నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" (యోహాను 6:63బి).

మనం తిన్న భోజనాన్ని జీర్ణించుకున్నట్టే, ఆయనను గూర్చి నేర్చుకొనుటవలన, అంగీకరించుట వలన, విశ్వసించుటవలన, విధేయులగుటవలన ప్రభువును మనం జీర్ణించుకుంటాం. మనం భుజించే ఆహారం మన శరీరాల్లో ఎలా భాగమైయుంటుందో, అలాగే క్రీస్తు ఆలోచనలు, ఆయన శీలము మన ఆత్మలలో భాగమైపోవాలి. జానీ రామ్‌సే యిలా వ్రాశాడు: "నా ఆత్మయందు లీనమైయుండు, నా ఆలోచనను అనుకరించు, నా నడిపింపును అనుసరించు; అవును, పరలోక మార్గములయందు నాటబడియుండుమని ఆయన హెచ్చరిస్తున్నాడు!"[38] "క్రీస్తు స్వరూపం మనయందేర్పడు వరకు" తన "దైవ స్వభావములో పాలివారైయుండు"దని మనలను హెచ్చరించాడు (2 పేతురు 1:4). "ఇకను జీవించువాడను నేను కాదు క్రీస్తే నా యందు జీవించుచున్నాడ"ని పౌలు అన్నట్టు మనం చెప్పగలిగే వరకు యిది కొనసాగాలి (గలతీ. 2:20).

యోహాను 6లో, తన శరీరమును తిని తన రక్తమును త్రాగితేనేగాని అని క్రీస్తు పలికినప్పుడు, ప్రభురాత్రి భోజనమనేది ఆయన మనస్సులో లేదు. ఆ రాత్రి భోజనం

యొక్క అలంకారంతో పరిచయమున్న మనకు 53నుండి 56 వచనాలవరకు గల భాషాప్రయోగం దీన్ని మనకు జ్ఞాపకం చేస్తుంది. అయితే, క్రీస్తు ప్రభువు భోజనంలో పోల్గొనే విషయమై తన అక్కరను యిక్కడ ప్రదర్శించలేదు, కాని యూదులు ఆయనను మెస్సీయగా అంగీకరించడాన్ని గూర్చి మాత్రమే మాట్లాడుతున్నారు. విశ్వసించడం – విశ్వసింపకపోవడం అన్న అంశాలే ప్రాణాధారము అన్న ప్రసంగంలోని సందేశం.

(3) **శిష్యులు పరీక్షింపబడ్డారు.** ఉద్రిక్తత కొనసాగింది [యేసు జీవాహారమై యున్నాడన్న మాటలను విన్న] "ఆయన శిష్యులలో అనేకులు ఈ మాటవిని – యిది కఠినమైన మాట, యిది ఎవడు వినగలడని చెప్పుకొనిరి" (యోహాను 6:60). సణిగే వీరు ఆయన శత్రువులు కారు సరిగదా, పైపైననే రొట్టెను వెదకే ప్రతినిధులు కూడా కారు. అయితే, (యోహాను 6:61). వారు ఆయన శిష్యులు, వారిలో కొందరు కొంతకాలంగా ఆయనను వెంబడించినవారు. శిష్యులు అనే పదం పండ్రెండుమంది [యోహాను 6:64]. మరియు, దాదాపుగా జీవితకాలమంతా శిష్యులుగా ఉన్నవారు [లూకా 6:13].)

తన్ను వెంబడించే వారిని యేసు బోధ ఎందుకు కలతపరచింది? రాజకీయమైన ఖడ్గం ఆడించే మెస్సీయా అనే వారు ముందుగా ఊహించిన భావాలకు అది వ్యతిరేకంగా ఉంది. విచారంగా ప్రభువు వారితో యిలా అన్నారు: "– దీనివలన మీరు అభ్యంతరపడు చున్నారు? ఆలాగైతే మనుష్యకుమారుడు మునుపున్న చోటునకు ఎక్కుట మీరు చూచినయెడల ఏమందురు?" (యోహాను 6:61బి, 62). మరొవిధంగా చెప్పాలంటే, "భౌతికమైన దానిమీద కాకుండ ఆత్మ సంబంధమైన వాటిపై – దృష్టిని కేంద్రీకరించి నందుకు మీరు నన్ను మెస్సీయగా అంగీకరించక పోయినట్టయితే, ఏలాటి రాజ్యం కొరకు మీరు ఎదురు చూస్తున్నారో దాన్ని నేను స్థాపింపకుండ వెళ్లిపోయినట్టయితే, నన్ను మీరు ఎలా చేపట్టగలరు?" క్రీస్తు ఆరోహణము – ఆయన మరణము సమాధి పునరుత్థానాల తరువాత – పెంతెకోస్తు దినమున సంఘ/రాజ్యము స్థాపించడానికి దోహదమయ్యింది – అయితే ఆయన అనుచరులు అప్పటికి భిన్నమైన రాజ్యమును ఆశిస్తున్నారు.

శరీరసంబంధమైన వాటికంటె ఆత్మ సంబంధమైనవి ఎంతో ఎక్కువ ప్రాముఖ్యత గలవైనవని ప్రభువు తిరిగి నొక్కి చెప్పారు. (యోహాను 6:63) అయితే ఆయన ఈలాగు దానిని ముగింపుచేయవలసి వచ్చింది: "మీలో విశ్వసించని వారు కొందరున్నారని వారితో చెప్పెను" (యోహాను 6:64ఎ). ఈ పాఠానికి మొదటిలోనే ఈ సంఘటన ఆయన పరిచర్యలో బహు తక్కువ స్థాయికి చేరుకుందని తెలిపాను. "అప్పటినుండి ఆయన శిష్యులలో అనేకులు వెనుక తీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు" (యోహాను 6:66).[39]

ప్రభువు జరిగించిన విశ్వాసపు పరీక్ష సణుగుడుతో, వివాదంతో, వెనుదీయడంతో వ్యతిరేక ఫలితాలనిచ్చింది. ఆయన "క్లాసులకు" అధిక సంఖ్యాకులు రాక ఉండిపోయారు.

(4) **అపొస్తలులు పరీక్షింపబడ్డారు.** బహుకీలకమైన పరీక్ష మిగిలి పోయింది. ప్రభువు తన పండ్రెండుమంది వైపు తిరిగి "– మీరు కూడ వెళ్లిపోవలెనని యున్నారా?" అని ఆయన అడిగారు (యోహాను 6:67). తప్పక, ఆ మాటల్లో విచారము, అక్కర మనం చూడగలుగుతాం.

పేతురు జవాబు ఆయన హృదయాన్ని ఆనందింపజేసి ఉండవచ్చు: అపొస్తలుల తరుపున మాట్లాడుతూ, అతడిలా అన్నాడు: "ప్రభువా, యెవని యొద్దకు వెళ్లుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగియున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:68, 69). సందర్భంలో కీలక పదమేమంటే –, "మేము విశ్వసించియున్నాము" వారి విశ్వాసము పరిపూర్ణమయ్యిందా? క్రీస్తు ఎవరైయున్నారో వారు పూర్ణంగా గ్రహించగలిగరా? రాజ్యము యొక్క నిజమైన స్వభావము వారి మనస్సుల్లో తేటగా ఉందా? లేదు, లేదు, లేదు, అయితే, యేసే మెస్సీయయైయున్నాడని, వారాయనకు సమర్పించుకున్నారు. వారి విశ్వాసము వృద్ధిపొందుతుంది. వారు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు!

తిరిగి దీన్ని మరో విధంగా చెప్పనీయ్యి. పేతురుకు కూడా ఆ విషయం తెలియదు.[40] అతడు పదకొండు మంది అపొస్తలుల కొరకు మాత్రమే మాట్లాడాడు. జీవాహారము చుట్టు ఆవరించియున్న సంభవాలు – యూదా ప్రభువును చివరిగా నిరాకరించడానికి దోహదం చేసినట్టు మన లేఖన భాగాలు సూచిస్తున్నాయి (యోహాను 6:64, 70, 71).[41] యూదా భౌతికంగా ఆ సమయంలో ఆయనను విడిచివెళ్లలేదు, కాని అతని హృదయం ఇక ఏ మాత్రం ప్రభువుతో ఉండలేదు. ప్రభువు భూసంబంధమైన సింహాసనాన్ని నిరాకరించినప్పుడే (యోహాను 6:15) అతని అంతరంగం నిరాశతో అలుముకొని యుండవచ్చు.[42] జనసమూహాలను తరిమి కొట్టెలా క్రీస్తు మాటలాడినప్పుడు అవిశ్వాసము అతనిని ఆవరించియుండవచ్చు; ఎందుకంటె సామ్రాజ్యాన్ని నిర్మించేది అలా కాదు! మొత్తం మీద, ఒక గ్రూపుగా ఆ పండ్రెండు మంది, పరీక్షలో పాస్ మార్కులు సంపాదించారు గాని యూదా ఘోరంగా తప్పిపోయాడు.

## ముగింపు

అపొస్తలులకు యింకా వేరే పరీక్షలుంటాయి (మత్తయి 16:13 చూడు), కాని క్రీస్తును వెంబడిస్తున్నామని చెప్పుకున్నవారి మీద ఆ సారి పడిన పరీక్ష ప్రభావమువంటిది యింకెప్పుడు జరిగినట్టులేదు. నీవు దీన్ని గుర్తించినా లేకున్నా, నీవు నేను యింకను ఈలాటి పరీక్షలకు లోనైనవారమైయుంటాం:

1. ఆయన నా అవసరతలు తీర్చువాడని నేను నమ్ముతున్నానా? లేక సమస్యలు వచ్చినప్పుడు భయపడి కంగారుపడతానా?
2. నన్ను కాపాడుతాడని నేను ఆయనను నమ్ముతున్నానా, లేక నా జీవితంలోనికి బాధలు వచ్చినప్పుడు భయముతో క్రుంగిపోతానా?
3. నాకు జీవము ప్రసాదించునట్టు నేనాయనను నమ్ముతానా? అలాగైనట్టయితే, నా జీవితాన్ని ఆయనకు సమర్పించుకుంటాను.

గుర్తుంచుకో: విశ్వాసము, నిజమైన విశ్వాసము కలిగినవాడు మాత్రమే పాసయ్యే మార్కులు పొందుతాడు.

## నోట్సు

ఈ పాఠంతో జోడయ్యే ప్రసంగం కొరకు నేను తంటాలు పడ్డాను. అత్యద్భుతంగా ఆహారం పెట్టడం మీదను, జీవాహారపు చర్చమీద రెండు ప్రసంగాలు సిద్ధపరచేవాడనే. అయినా, ప్రతి పాఠానికి రెండు ప్రసంగాలు వచ్చే అలవాటు నేను చేయకోరలేదు. జీవాహారము యొక్క భాగాన్ని నేను ఎందుకు కోరుకున్నానంటే, అది విద్యార్థులకు అంత పరిచయమైనది కాదు. "కాని 5000 మందికి ఆహారం పెట్టడం మీద ఎందుకు నిలిచానంటే, ఆది క్రైస్తవులకు అది ఎంతో ముఖ్యమయ్యింది."[43] మరియు నేటి క్రైస్తవులకు కూడా అది బాగుగా తెలిసినదైయుంది. ఈ సంభవంమీద నా వివరణ ఈ పాఠంలో ఉంది.

జీవాహారం మీద నేను ప్రసంగాన్ని సిద్ధపరచియుంటే, నా విధానం ఎలాగుండేదంటే "తప్పు కారణాలతో దేవుని వెదకడం" అని ఉండేదే. ఆయన ప్రసాదించే ఆత్మసంబంధమైన అశీర్వాదము కంటె ఆయన యిచ్చే భౌతికసంబంధమైన మేళ్లుకొరకు వెదకేవారితోనే ప్రభువైన యేసు ఆవరింపబడియున్నారు. మన సంగతి ఏమిటి?

వాస్తవానికి, ఈ పాఠం ప్రసంగాంశాలతో నిండియుంది. 5000 మందికి ఆహారం పెట్టడాన్ని యితరులకు సహాయం చేయడం మీద ప్రసంగిస్తాను. "జనసమూహాలకు అహారంపెట్టడం" అంటూ సువార్త వ్యాప్తికొరకైన ప్రసంగానికి ఉపయోగించుకోవచ్చు. (1) జనులు భౌతిక అవసరతలకు ప్రభువు ఎలాగో ఆలాగే వారి ఆత్మసంబంధమైన అవసరతలను గూర్చి మనం అక్కర కలిగియుండవచ్చు. (2) ఆత్మ సంబంధంగా జనులను పోషించాలంటే మనకున్న సొంత ఆధారాలను దాటి దేవునిపై మనం ఆధారపడ వలసియుంటుంది. (3) ఆత్మసంబంధమైన పోషణ దేవుని వాక్యం నుండి కలుగుతుంది. మన బాధ్యత దాన్ని పంచడంవరకు మాత్రమే – దాన్ని పుట్టించడం కాదు – అపొస్తలులవలెనే.

ప్రభువు నీళ్లమీద నడచుట, తుఫానును నిమ్మళింపజేయుట అనే సంభవాలను గూర్చి ఆలోచించు. ఈ సంభవానికి "క్రీస్తు దూరముగా నున్నప్పుడు" అనే పేరు పెట్టవచ్చు. ముఖ్య విషయాలు కొన్ని ఉన్నాయి: (1) నీవు ప్రభువునకు లోబడినప్పుడు సయితం తుఫానులు వస్తాయి. (2) తుఫానులు వచ్చినప్పుడు నీ బలహీనతవైపు కాక, ఆయన శక్తిమీద ఆధారపడు (3) నీ జీవితంలో లేచే తుఫానులను యేసు ఎరుగును. (4) తుఫానును ఆయన అణచగలడని విశ్వసించు (5) నిమ్మళించడంతో ఎదురుచూడని దీవెన కలుగవచ్చు (యోహాను 6:21బి).

పై కథలోని ఒక భాగం మీద కూడా ప్రసంగాలు చేయబడతాయి: పేతురు నీళ్లమీద నడచి (మునిగిపోవుట) – జీవితమనే గాలులు అలలపైన కాక ప్రభువు మీద దృష్టి నిలుపుటను గురించి నొక్కి పలుకవచ్చు.

జీవాహారము మీద ప్రభువు చర్చ యోహాను 6లో ప్రసంగ అవకాశాలున్నాయి. ఉదాహరణకు, "మేము ఎవనియొద్దకు వెళ్లుదుము?" (68 వ.) అనేది అర్థవంతమైన ప్రసంగాంశంగా ఉపయోగించవచ్చు. లోక సమస్యలకు ప్రభువే పరిష్కారం అని గ్రహించేవరకు కొందరు ఆయనను గూర్చి తీవ్రంగా ఆలోచింపరు – వారి ఆత్మలకు మరల, జనసమూహానికి, అరణ్యంలో మన్నాయే మనస్సులో ఉన్నందున, క్రీస్తు దానిని

జీవాహారముతో తారతమ్యాన్ని సూచించారు. ఆ తారతమ్యం చూపడానికి నీవు ఒక చార్టు తయారు చేయవచ్చు. నీ ఆలోచనను రేకెత్తించడానికి ఒక చార్టు ఈ క్రిందయివ్వ బడింది.

---

## సూచనలు

[1]"క్రీస్తు జీవితం, భాగం 3లో" "నీవు నమ్ముతున్నావా?" పాఠానికి పరిచయాన్ని తిరిగి చదువు. [2]గత పాఠంలోని చివరి భాగాన్ని తిరిగి చదువు. [3]"ప్రజలకు నిజంగా సహాయం కావలసినప్పుడు" అనే పాఠంలోని ఆరంభం నుండి పరిచయాన్ని చూడు. [4]రక్షించు విశ్వాసములో "నమ్మికయుంచుట" అనేది ప్రాముఖ్యమైయున్నది, సబ్‌పాయింట్స్‌లో నేను దీన్ని వినియోగిస్తున్నాను. [5]ఈ ప్రతిపాదన ఆలాగే లేఖనంలో కన్పించదు – అయినా క్రీస్తు తన అపొస్తలులకు యిచ్చిన పరీక్షలలో నేను ఉపయోగించిన భావన కన్పిస్తుంది. [6]ఇది గుప్తమైయుంది. వారు అక్కడికి ఏ ఆహారము తెచ్చినట్టులేదు. తెచ్చియుంటె చెప్పియుండేవారే. హేరోదు ప్రాంతాన్ని విడిచిపెట్టాలనే తొందరలో వారు వచ్చారు. ప్రక్కనున్న గ్రామంలో భోజనం కొనవచ్చునన్న ఉద్దేశం వారికి కలిగియుండవచ్చు (యోహాను 4:8). [7]తరువాత మన కథలో వారు తమ అసమర్థతను ఈ విషయంలో కనుపరచారు; మార్కు 6:42 చదువు. [8]రొట్టెలు, చేపల యొక్క సైజును గూర్చి తరువాత పాఠంలో చూడు. [9]ప్రజలు తృప్తిపొందేవరకు భుజించారు. [10]వారి ఉత్సాహాన్ని యోహాను 6:26 చిత్రిస్తుంది.

[11]తనవంటి ఒక ప్రవక్తను దేవుడు వారి మధ్యనుండి లేపుతాడనే మోషే మాటలను ప్రజలు జ్ఞాపకం చేసికొని యుండవచ్చు (ద్వితీయో. 18:15). ప్రజలు ఆయనను మోషేతో పోల్చుతున్నారు (యోహాను 6:31, 32, 49, 58లను చూడు). [12]యేసు యెరూషలేములో విజయోత్సవముతో ప్రవేశించినప్పుడు – ప్రభువు పరిచర్యలోని చివరి భాగంలో – జనులలో అదే ఉద్రేకం నెలకొన్నది (మత్తయి 21:1–11, 14–17; మార్కు 11:1–11; లూకా 19:29–44; యోహాను 12:12–19). [13]తండ్రియొద్దకు ఆరోహణమయ్యేవరకు క్రీస్తుకు పట్టాభిషేకం చేయలేదనే భావముంది. అయినా, యూదులకు రాజుగా ప్రభువు తన్ను గుర్తించుకున్నందున (మత్తయి 27:11), జ్ఞానుల మాటలు ఖచ్చితమైనవని మనం గుర్తించవలసియుంటుంది. [14]ఆయన వారికి బేత్సయిదా/ కపెర్నహూమునకు పోనాజ్ఞాపించారు (మార్కు 6:45; యోహాను 6:17). (బేత్సయిదా కపెర్నహూమునకు సమీపంగా ఉంటుంది). యేసు తన శిష్యులను ఎందుకు పంపివేశారు. మనకు తెలియదు. వారు కూడా భౌతిక సంబంధమైన రాజ్యం కొరకే అప్పటిలో ఎదురుచూస్తున్నారు. [15]జన సమూహంలో ఎక్కువమంది ఆ దరిదాపులోనే ఉండిపోయారు (యోహాను 6:22). వారిని పంపివేయడం ద్వారా ఆయన వారి ఉద్రేకాన్ని చల్లార్చారు. [16]ఇది గుప్తం చేయబడింది. ఆయన విచారించడానికి అనేక కారాణాలున్నాయి. జనసమూహాము, అపొస్తలులు సయితం అపార్థాన్ని వ్యక్తపరచారు. తన బంధువైన బాప్తిస్మమిచ్చు యోహాను మరణానికి సంతాపం తెలిపే అవకాశం కూడా ఆయనకు లేక పోయింది. [17]ఆ ప్రాంతంలో ఒక పర్వతముంది (యోహాను 6:3) బోధించడానికి ప్రభువు ఆ పర్వతం మీద కూర్చుండి యుండవచ్చు. భోజనం పెట్టడానికి ఆయన దిగి మైదానం మీదికి వచ్చినట్టున్నారు. [18]NASBలో "మూడు లేక నాలుగు మైళ్లు" అని ఉంది (యోహాను 6:19). KJVలో "ఇరవైయయిదు లేక ముప్పై ఫర్లాంగులు" అని ఉంది. గ్రీకులో ఇరవైయైదు లేక ముప్పై Stadia అని ఉంది. Stadion అనే దానికి Stadia అనేది బహువచనం, రోమా కొలతతో ఆది 607 అడుగులు. [19]"క్రీస్తు జీవితం, భాగం 3లో" గలిలయ సముద్రముపై చర్చను చదువు. [20]అది చీకటి పడుతున్న సాయంత్రపు వేళ (యోహాను 6:16, 17 చూడు). ప్రభువు వారి యొద్దకు నాలుగవ జాముపరకు రాలేదు (మత్తయి 14:25; మార్కు 6:48), అది 3–6 గంటల మధ్య కాలం ఉదయం.

[21]క్రీస్తు తుఫాను పంపలేదు, కాని జీవితంలోని ప్రతి యిబ్బంది ఆయన యందలి మన విశ్వాసాన్ని పరీక్షిస్తుంది. [22]"క్రీస్తు జీవితం, భాగం 3లోని" "ఈయన ఎవరో?" అనే పాఠాన్ని చదువు. [23]"వారిని దాటిపోవలెననియున్నట్టు" మార్కు రచన అంటుంది (మార్కు 6:48 చూడు). వారిని భయపెట్టకుండుటకై వారిని ఆయన దాటిపోవలెనని ఉన్నట్టు కొందరు చూచించారు. అయితే యితర వర్ణనలు మాత్రం వారి యొద్దకు వెళ్లినట్టున్నాయి (మత్తయి 14:25; యోహాను 6:19). మార్కు 6లో "దాటిపోవలెనని" అన్నదానికి గ్రీకులో – "ప్రక్కగా పోవుట"–అనేది అక్కడ భావం. [24]భూతమని వారు ఎందుకు అనుకున్నారో మనకు చెప్పబడలేదు. ఆ దినాల్లో మనుష్యుల హృదయాల్లో మూఢ నమ్మకాలు ఏలుతున్నట్టు గుర్తుచేసికో. [25]ఈ సంభవాలు వెంటనే జరిగినట్టు యోహాను 6:21 సూచిస్తుంది. [26]అప్పుడప్పుడు, గలిలయ సముద్రము

గన్నెసరెతు సరస్సు అని కూడా పిలువబడింది (లూకా 5:1). "గలిలయ సముద్రం" మీద రివ్యూ ఆర్టికల్ చూడు. [27]యేసు యొక్క వస్త్రపు చెంగు ముట్టిన వారిని గూర్చి "క్రీస్తు జీవితం, భాగం 3లో" చూడు. [28]నావలు పశ్చిమ తీరమున నున్న తిబెరయనుండి నావలు నడిపించేవారు   మనుష్యులను దాటవేస్తూ డబ్బు సంపాదించుకొంటూన్నారు కాబోలు. ముందుగా వారు కపెర్నహూమునుండి కాలినడకన వచ్చారు. నావలో వెళ్లడం ప్రయాణ సౌలభ్యంగా ఉంటుంది. [29]గొప్ప ప్రసంగాన్ని వచనం వెంట వచనం చర్చించ స్థలం చాలదు. "ఈ రొట్టెను తినుడి" యోహాను 1లోని చర్చను చూడుము. [30]ముందు పాఠంలో యోహాను 6:14 మీద నోట్సును రివ్యూ చేయి.

[31]దీన్ని సమరయ స్త్రీ విన్నపంతో పోల్చిచూడు (యోహాను 4:15). యోహాను 4, యోహాను 6కు మధ్య చాలా సమాంతరాలున్నాయి. యోహాను 4లోని స్త్రీ మనస్సు నీళ్లపై నున్నందున అక్కడ నీళ్లని–యిక్కడ మనష్యుల ఆలోచన భోజనం మీద ఉన్నందున యిక్కడ భోజనమని ఉపయోగించింది. యోహాను 4 ఫలితం అంగీకారంగాను, యోహాను 6 చర్చ ఏమో తిరస్కారంగాను ముగిసింది. [32]48, 51 వచనాలు కూడా చూడు. ఇతర "నేనే" అనే ప్రతిపాదనలు 8:12, 58; 10:11; 11:25; 14:6; 15:1లో ఉన్నాయి. [33]ఆయనయందు విశ్వాసముంచవలసిన అవసరతను నొక్కి పలకడానికిగాను ప్రభువు ఎక్కువైన మాటలనుపయోగించారు (యోహాను 6:40, 47లను చూడు). [34]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co, 1914), 385. [35]David Smith, *The Days of His Flesh: The Earthly Life of Our Lord and Saviour Jesus Christ*, 8th ed. (London: Hodder and Stoughton 1910), 241 (emphasis his); quoted in Robert Duncan Culver, *The Life of Christ* (Grand Rapids, Mich.: Baker Book House, 1976), 147n. [36]రొట్టె, ద్రాక్షారసములు అక్షరార్థంగా మాంసం రక్తంగా మార్చబడుతుందని చెప్పడానికి కథోలిక్‌వారు ఉపయోగించుకునే లేఖన భాగం యిది. ఏదియేలాగున్నా, అది జ్ఞాపకార్థపు భోజనమని ప్రభువు తేటపరచారు (లూకా 22:19; 1 కొరింథీ. 11:24, 25). [37]యెషయా 54:13; యిర్మీయా 31:33, 34లను చదువు. [38]Johnny Ramsey, "Eat My Flesh; Drink My Blood," *Gospel Minutes* (27 July 1979): 3. [39]ఇది మొదలుకొని యోహానులో "శిష్యుడు" అనే పదం "నిజమైన శిష్యులకు" మాత్రమే ఉపయోగింపబడింది. [40]యూదా అవిశ్వాసాన్ని గూర్చి, తుది వరకు తక్కిన అపొస్తలులు తెలియకనే ఉన్నారు (యోహాను 13:21, 22 చూడు).

[41]యూదా ఎటుతోచని స్థితిలో ఉన్నాడు. అతన్ని కొందరు చాలా చెడ్డగా చిత్రించారు. ప్రభువును అమ్మిన కార్యానికి అతన్ని చిన్నచూపు చూచారు. ఇంకా ఎక్కువ సమాచారానికి యూదాను గూర్చిన చర్చను చూడు. [42]డబ్బుతో యూదా ఏకం చేయబడ్డాడు. [43]"ప్రజలకు నిజంగా సహాయం కావలసి వచ్చినప్పుడు" అనే దానిలోని కామెంట్లు చూడు.

---

## జీవాహారము (యోహాను 6:27-58)

| మన్నా | జీవాహారము |
|---|---|
| దేవునియొద్ద నుండి (31, 32 వచనాలు) | దేవునియొద్ద నుండి (32, 58 వచనాలు) |
| క్షయమైనది (27 వ.) | అక్షయమైనది (27 వ.) |
| శరీర సంబంధమైనది (రొట్టె) | ఆత్మసంబంధమైనది (యేసు 35, 48, 51 వచనాలు) |
| తిన్నవారు మరల ఆకలిగొన్నారు | భుజించువారు తృప్తి పొందుదురు (35 వ.) |
| తిన్నవారు కడకు మరణించారు (49, 58 వచనాలు) | తిన్నవారు జీవిస్తారు (33, 40, 47, 50, 51, 58 వచనాలు) |
| తినడంవలన సద్వినియోగం చేసికొన్నారు. (31 వ.). | విశ్వసించడం ద్వారా సద్వినియోగం చేసికొన్నారు (29, 35, 36, 40, 47 వచనాలు) |